



శనివారం ఇరాన్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైన టెల్ అవీవ్‌లోని ఓ భవనం, క్షిపణి ధాటికి తునాతునకలైన మరో భవనం, రమత్ గాన్‌లో ధ్వంసమైన నివాస భవనాలు, కార్లు

# యుద్ధం.. తీవ్రం

మొదటిపేజీ తరువాయి...

దాడుల్లో 78 మంది మరణించారని, 320 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి వెల్లడించారు. మృతుల్లో పలువురు ఉన్నత సైన్యాధికారులు, అణుశాస్త్రవేత్తలు ఉన్నట్టు తెలిపారు. శనివారం కూడా ఇజ్రాయెల్ పలుమార్లు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు చేసినట్టు ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. బోరుజెర్డ్‌లోని కార్ల తయారీ కంపెనీ, ఖుజెస్థాన్ ప్రావిన్స్‌లోని అబాదాన్‌లో పేలుళ్లు సంభవించినట్టు పేర్కొంది. కెర్మాన్‌షాలోని మిలిటరీ బరాక్స్ వద్ద కూడా దాడులు జరిగినట్టు తెలిపింది. ఇరాన్ దాడుల్లో తమ ఏడుగురు సైనికులు గాయపడ్డారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇజ్రాయెల్‌లోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం కూడా మూసివేశారు.

### ఇరాన్ తగలబడుతుంది: ఇజ్రాయెల్

తమ దేశంపై క్షిపణి దాడులు కొనసాగిస్తే టెహ్రాన్ తగలబడుతుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ శనివారం ఇరాన్‌ని హెచ్చరించారు. ఇరాన్ శనివారం ఉదయం ప్రతీకార దాడులు జరిపిన దరిమిలా ఆయన ఈ హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ ప్రజలను ముఖ్యంగా టెహ్రాన్ వాసులను బందీలుగా చేసుకుని వారి ప్రాణాలను ఇరాన్ నియంత పణంగా పెడుతున్నారని, ఇజ్రాయెల్ పౌరులపై జరిగే నేరపూరిత దాడులకు టెహ్రాన్ ప్రజలు మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని కట్జ్ హెచ్చరించారు.

### ఖమేనీ నివాసం సమీపంలో భారీ పేలుళ్లు!

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణలు ఉగ్రరూపం దాలుస్తున్న వేళ ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ నివాసం సమీపంలో, దేశాధ్యక్షుడి కార్యాలయం సమీపంలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇందుకు సంబంధించి గగతల రక్షణ కార్యకలాపాలతో కూడిన వీడియో ఒకటి శనివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం తెల్లవారుజామున ఖమేనీ నివాస ప్రాంగణంలో, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కార్యాలయం సమీపంలో భారీ పేలుళ్లు వినిపించినట్టు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ మీడియా తెలిపింది. ఇరాన్‌లోని అనేక ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఇజ్రాయెలీ డ్రోన్లు, క్షిపణులను కూల్చివేసేందుకు ఇరానియన్ రక్షణ వ్యవస్థలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపింది. ఇరాన్‌పై ప్రస్తుత సైనిక దాడికి రైజింగ్ లయన్ అని ఇజ్రాయెల్ నామకరణం చేయగా ఇజ్రాయెల్‌పై తన ప్రతీకార దాడికి ఇరాన్ ట్రూ ప్రామిస్ 3 ఆపరేషన్ అని పేరు పెట్టింది.

### ఖమేనీకి చావు తప్పదు!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో తమ ఇండ్ల పైకి ఎక్కి స్థానికులు 'నియంతకు చావు తప్పదు', 'ఖమేనీకి చావు తప్పదు' అంటూ నినాదాలు చేస్తున్నట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ శనివారం వెల్లడించింది. కాగా, శనివారం దేశ ప్రజలను ఉద్దేశించి ఖమేనీ ముందుగానే రికార్డు చేసిన సందేశాన్ని వినిపిస్తూ ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులు కొనసాగుతాయని వాగ్దానం చేశారు. ఇరాన్ సైన్యం స్పందించడానికి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. వాళ్లు దాడి చేశారు, అంతా అయిపోయిందని భావించవద్దని, ముందుగా దాడి చేసి ఘర్షణను వాళ్లే మొదలుపెట్టారని, ఈ తప్పుడు పనికి వాళ్లు పర్యవసానాలను తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు.



క్షిపణి దాడిలో తమ ఇల్లు ధ్వంసమైందని రోదిస్తున్న ఇజ్రాయెల్‌కు చెందిన బాధిత కుటుంబ సభ్యులు

### ఇజ్రాయెల్ ప్రధాన విమానాశ్రయం మూసివేత

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదారులు కొనసాగేంత వరకు ఇజ్రాయెల్‌కు చెందిన ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్లు ఆ దేశ ఎయిర్‌పోర్టు అథారిటీ శనివారం ప్రకటించింది. టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేసినట్లు సంస్థ తెలిపింది.

### దాడులు కొనసాగిస్తాం: నెతన్యాహు



ఇరాన్‌పై సైనిక చర్యను కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇరాన్ ప్రజలనుద్దేశించి చేసిన వీడియో ప్రసంగంలో ఆయన 'మరిన్ని దాడులు జరుగుతాయి' అని చెప్పారు. గత 24 గంటల్లో ఇరాన్‌కు చెందిన పలువురు సైనిక కమాండర్లను, సీనియర్ అణు శాస్త్రవేత్తలను హతమార్చామని తెలిపారు. ఇరాన్‌లోని ప్రముఖ అణు కేంద్రాలను, ఖండాంతర క్షిపణుల ఆయుధాగారాలను ధ్వంసం చేశామని అన్నారు. 'ఎక్కడ నష్టం జరిగిందో లేదా ఇంకా ఎక్కడ జరుగనున్నదో ఇరాన్ పాలకులకు ఇంకా తెలియడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రజలు తమ పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని నెతన్యాహు పిలుపునిచ్చారు. తమ జాతీయ పతాకం చుట్టూ, తమ చారిత్రక వారసత్వ కోసం ఇరాన్ ప్రజలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది అని అన్నారు. దాదాపు 50 ఏండ్లుగా సాగుతున్న దుష్ట, నియంతృత్వ పాలన నుంచి స్వాతంత్ర్యం కోసం ఐక్యంగా నిలవాలని కోరారు. ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న అణ్వాయుధ, ఖండాంతర క్షిపణుల ముప్పును తొలగించడమే తమ సైనిక చర్య వెనుక ముఖ్య ఉద్దేశమని స్పష్టంచేశారు.

### ఇద్దరు ఉన్నతాధికారులు మృతి: ఇరాన్

ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడులలో ఇరాన్ సాయుధ దళాలకు చెందిన ఇద్దరు ఉన్నత స్థాయి అధికారులు మరణించినట్లు ఇరానియన్ ప్రభుత్వ టెలివిజన్ శనివారం ప్రకటించింది. మరణించిన ఇద్దరు సైనిక జనరల్స్ పేర్లను ప్రకటించిన టీవీ వారు ఎక్కడ మరణించిందీ వెల్లడించలేదు. కాగా, శుక్రవారం ఇజ్రాయెల్ సాయుధ దళాలు జరిపిన వైమానిక దాడులలో ఇరాన్ ఆర్మీకి చెందిన చీఫ్ ఆఫ్ స్టాఫ్, పారామిలిటరీ రివల్యూషనరీ గార్డు అధిపతితో సహా పలువురు ఉన్నతాధికారులు మరణించారు.

### ఇజ్రాయెల్‌కు సహకరిస్తే తీవ్ర పరిణామాలు: ఇరాన్

ఇజ్రాయెల్‌కు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలను ఇరాన్ హెచ్చరించింది. తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి ప్రయత్నించవద్దని సూచించింది. లేకపోతే పశ్చిమాసియాలోని ఆయా దేశాల సైనిక స్థావరాలు, నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.

### అణు చర్చలు అర్థరహితం

ఇజ్రాయెల్ తమపై దాడులు చేస్తున్న నేపథ్యంలో ఇక అమెరికాతో అణు చర్చలు జరపడం అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఒమన్‌లో ఆదివారం అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య అణు చర్చలు కొనసాగాల్సి ఉన్నది. అమెరికా చర్యలు అణు చర్చలను అర్థరహితం చేశాయి అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేయి వ్యాఖ్యానించారు. అయితే చర్చలు రద్దయ్యాయా లేదా అన్నదానిపై మాత్రం ఆయన స్పష్టతనివ్వలేదు.

### దాడులు ఆపండి

- పోప్, గుటెర్రెస్

ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోప్ లియో పిలుపునిచ్చారు. వాటికన్‌లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ..అణ్వాయుధ ముప్పు నుంచి సురక్షిత ప్రపంచ నిర్మాణం కోసం ప్రయత్నించాలని అన్నారు. ఇందుకు చిత్తశుద్ధితో చర్చలు జరపాలని కోరారు. ఒక దేశం మనుగడను మరొక దేశం ప్రశ్నార్థకంగా మార్చరాదని అన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్‌లు వెంటనే పరస్పర దాడులను ఆపాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్ పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పెరిగిన ఉద్రిక్తతలు చాలని, ఇక ఆపాలని అన్నారు. శాంతి, దౌత్యం వర్ధిల్లాలి అని పేర్కొన్నారు.

### గగన మార్గాల మూసివేత

ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మధ్యనున్న సిరియా, ఇరాక్ జోర్డాన్ దేశాలు తమ వైమానిక మార్గాలను మూసివేశాయి. అయితే శనివారం కొద్దిసేపు దాడులకు విరామం లభించడంతో వైమానిక మార్గాన్ని తెరిచినట్టు సిరియా సివిల్ ఏవియేషన్ సంస్థ తెలిపింది. కొన్ని విమానాల రాకపోకలను పునరుద్ధరించినట్టు పేర్కొంది. లెబనాన్ వైమానిక మార్గాలను శనివారం ఉదయం ప్రారంభించినట్టు తెలిపింది. విమానాలను నిలిపివేసినందుకు ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. జోర్డాన్ కూడా విమానాల రాకపోకలను ప్రారంభించినట్టు తెలిపింది.

---

### పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**పంచాయతీరాజ్ ఆఫీస్ ఎదుట మాజీ సర్పంచుల నిరసన**

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులు నిరసన చేపట్టారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాజీ సర్పంచులు శనివారం కార్యాలయం గేటుకు వినతిపత్రం ముడుపు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు పెండింగ్ బిల్లులు మంజూరు కోసం అనేకమార్లు గవర్నర్, సీఎం, మంత్రులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రామాభివృద్ధి పాటుపడిన మాజీ సర్పంచులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, రాజేందర్, రవీందర్‌రావు, రవి, నాయకులు ఎల్లారెడ్డి, అరవింద్, బోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

### సంపత్.. రాజోళిలో పర్యటించే దమ్ముందా?

- బీఆర్ఎస్ నేత కురువ విజయ్



గద్వాల, జూన్ 14: 'నీకు రాజకీయ భిక్ష పెట్టిన రాజోళి మండలంలో ఏ గ్రామానికైనా వెళ్లే దమ్ము నీకుందా'..? అని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నేత కురువ విజయ్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని ఆందోళన చేసిన రైతులు, స్థానికులపై పోలీసులు కేసు నమోదుచేసి జైలుకు పంపినా.. వారి గురించి సంపత్ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. అలంపూర్ ప్రజలు ఛీకొట్టినా సిగ్గులేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. త్వరలో సంపత్‌కు సంబంధించి ల్యాండ్, సాండ్, మైనింగ్ మాఫియా గురించి నిజాలు బయటపెడ్తానని తెలిపారు.

## సుంకిశాల కూలినా కనిపించదా?

- ఎస్ఎల్బీసీ కూలి 8 మంది చనిపోయినా స్పందనేది?
- టన్నెల్ కూలినా పట్టించుకోని కేంద్రం
- కాళేశ్వరంలో పిల్లర్‌కు పగుళ్లు వస్తే రాద్ధాంతమా?
- కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందంలో భాగమేనా?
- ప్రభుత్వ వైఫల్యాలపై నోరెత్తని బీజేపీ
- ఏపీ జల దోపిడీ విషయంలోనూ నోరెత్తకుండా కూడబలుక్కొని తెలంగాణకు తీరని అన్యాయం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ధ్వజం




తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో దేవీప్రసాద్, కిశోర్‌గౌడ్

హైదరాబాద్ జూన్ 14 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అగమేఘాలపై ఎన్డీఎస్ఏను పంపిన కేంద్రం.. ఎస్ఎల్బీసీ సొరంగం కుప్పకూలి ఎనిమిది మంది ప్రాణాలు పోయినా, సుంకిశాల కూలిపోయినా, వట్టెం పంప్‌హౌస్ మునిగిపోయినా ఎందుకు మౌనం వహిస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందంలో భాగం కాదా? అంటూ ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వానికి ముల్లుగుచ్చితే బీజేపీ నాయకులకు నొప్పి పెడుతున్నదని ఎద్దేవాచేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రక్షణ చర్యలు చేపట్టకుండా, అధికారుల సూచనలు తీసుకోకుండా ఈ మార్గంలో 10 వేల లీటర్ల నీళ్లు ఉబికి వస్తున్నాయని కంపెనీ ఇచ్చిన నివేదికను కూడా పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్బీసీ సొరంగం తవ్వకం పనులు మొదలు పెట్టిందని విమర్శించారు. కాళేశ్వరంపై కమిషన్ వేసిన ముఖ్యమంత్రి.. ఆధారాలుంటే కమిషన్‌కు ఇవ్వకుండా మీడియా ద్వారా ప్రజలకు చెప్తాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బాధ్యాతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి.. సర్కారు నియమించిన కమిషన్ పరిధిలోని అంశంపై బహిరంగంగా మాట్లాడతానని చెప్పడం అవగాహనారాహిత్యానికి నిదర్శనమని దెప్పిపొడిచారు.

### సంజయ్.. ప్రజలకు క్షమాపణ చెప్పు

ఇటీవల ఏపీ పర్యటనకు వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణ కంటే ఏపీకి 10 రెట్లు ఎక్కువ నిధులిచ్చామని చెప్పడం దురదృష్టకరమని, ఏపీకి మేలు చేసి తెలంగాణకు అన్యాయం చేశామని ఆయన నిస్సిగ్గుగా ఒప్పుకొన్నారని నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. మన రాష్ట్రానికి పది రూపాయలు కూడా తీసుకురావడం చేతగాని సంజయ్.. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఆంధ్రప్రదేశ్‌కు వంతపాడటం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. సంజయ్ వెంటనే తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఓట్ల కోసమే రుణమాఫీ నాటకం

రుణమాఫీ సైట్‌ను మూసేసిన ప్రభుత్వం ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో ఓట్లకోసమే మాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని నాటకాలాడుతున్నదని సింగిరెడ్డి మండిపడ్డారు. యాసంగిలో 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్టు చెప్తున్న సర్కారు, ఎంత మంది రైతులకు? ఎన్ని క్వింటాళ్ల వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చిందని ప్రశ్నించారు. భూమిని నమ్ముకున్న రైతు కుటుంబాలకు అండగా నిలిచేందుకు కేసీఆర్ తెచ్చిన రైతుబీమాను రేవంత్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. నిరుటి ప్రీమియాన్నే ఇప్పటికీ జమచేయలేదని విమర్శించారు.

> కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా, అధికారుల సూచనలు తీసుకోకుండా, ఈ మార్గంలో 10 వేల లీటర్ల నీళ్లు ఉబికి వస్తున్నయని కంపెనీ ఇచ్చిన నివేదికను పట్టించుకోకుండా కాంగ్రెస్ సర్కారు ఎస్ఎల్బీసీ సొరంగం పనులు మొదలు పెట్టింది. ఈ ప్రభుత్వం చేసిన పాపానికి ఎనిమిది మంది అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయినయి. ఇంత జరిగినా రెండేండ్లలో ప్రాజెక్టు పూర్తిచేస్తమని మంత్రి ఉత్తమ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది. అమెరికాలో టీబీఎం డిజైన్‌కే మూడేండ్లు పడుతది. మరి రెండేండ్లల్ల ఎట్ల కంప్లీట్ చేస్తరు?
>
> -నిరంజన్‌రెడ్డి

### రైతు భరోసా ఎత్తేసే కుట్రలు

గత యాసంగిలో నాలుగెకరాల్లోపు రైతులకే రైతుబంధు వేసిన ప్రభుత్వం మిగిలిన రైతులను దగా చేసిందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మళ్లీ లోకల్ బాడీ ఎన్నికల ముందు రైతుభరోసా వేస్తామని కొత్త డ్రామాకు తెరలేపిందని దుయ్యబట్టారు. ఓట్లు డబ్బాలో పడగానే రైతుభరోసా పథకాన్ని ఎత్తేసేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. ఇది నిజం కాకుంటే ఈ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ముందుచూపుతో ఎరువులను దిగుమతి చేసుకొని 6 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత 3 లక్షల టన్నుల ఎరువులను కూడా నిల్వచేయడం లేదని తెలిపారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించలేమని తెలిసే సరఫరా చేయడం లేదని కేంద్రంపై నెపం నెడుతున్నదని విమర్శించారు. నాడు రైతు సమస్యలపై సీఎం హోదాలో కేసీఆర్ అనేకసార్లు కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారని, కానీ సీఎం రేవంత్ మాత్రం ఏనాడూ రైతుల గురించి కేంద్ర మంత్రిని కలిసిన దాఖలాల్లేవని విమర్శించారు. అన్నదాతల మేలు మరిచి అందాల పోటీల్లో మునిగితేలారని తూర్పారబట్టారు.

### రేవంత్ మాటలతో ఏం ఉపయోగం?

'నేను మోదీ స్కూల్‌లో చదువుకున్న.. చంద్రబాబు కాలేజీలో ఇంటర్ పూర్తిచేసిన.. ఇప్పుడు రాహుల్ దగ్గర పనిచేస్తున్న అని ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ చెప్పిన మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నరు' అని నిరంజన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆయన వ్యాఖ్యలతో తెలంగాణ ప్రజలకు కలిగే ప్రయోజనమేమిటని నిలదీశారు. స్కూళ్లు ప్రారంభమైనా గురుకులాల అద్దె , విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదని, పెండ్లి చేసుకున్న ఆడబిడ్డలకు తులం బంగారం, మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇవ్వడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

### గత్యంతరంలేకనే నెత్తికెత్తుకున్నం..

**ఎస్ఎల్బీసీ** ప్రాజెక్టు సాధ్యం కాదని కేసీఆర్ పలుమార్లు చెప్పారని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. 2016, మార్చి 31న అసెంబ్లీ సాక్షిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. అప్పటికే సొరంగంలోకి టన్నెల్ బోరు మిషన్ పంపించడం.. వందల కోట్లు ఖర్చుపెట్టడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాల్సి వచ్చిందని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు రూ.3,900 కోట్లు వెచ్చించి 11.482 కిలో మీటర్ల టన్నెల్ తవ్వకం పనులు పూర్తిచేశామని తెలిపారు. కానీ మూడేండ్లలో పూర్తిచేస్తామని గొప్పలకు పోయిన రేవంత్ ప్రభుత్వం ప్రమాదం జరిగిన తర్వాత ప్రత్యామ్నాయ మార్గాల పేరిట నాటకాలు ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు మళ్లీ రెండేళ్లలోనే పూర్తిచేస్తామని ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. అమెరికాలో టీబీఎం డిజైన్‌కే మూడేండ్లు పడుతుందని, మరి ఏవిధంగా కంప్లీట్ చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తప్పుడు మాటలు కట్టిపెట్టి వాస్తవాలను చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏ ప్రాజెక్టునూ రెండు, మూడేండ్లలో పూర్తి చేయలేదని గుర్తుచేశారు.

## ఎమ్మెల్యే బీర్ల నివాసంలో అనుమానాస్పద మృతి!

మొదటిపేజీ తరువాయి...

ఒక కూతురితో కలిసి యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో వంటతోపాటు ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో కూతురు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నది. కారణం తెలియదు గానీ మనోవేదనకు గురైన రవి మద్యానికి బానిసయ్యాడు. నెల క్రితం మద్యం తాగి ఇంటికి వచ్చిన రవిని ఎమ్మెల్యే భార్య మందలించినట్టు సమాచారం. మాటామాట పెరగడంతో ఎమ్మెల్యే అయిలయ్య.. రవిపై చెయ్యి చేసుకున్నాడని తెలుస్తున్నది. దీంతో అతడు నెల క్రితమే నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం. అతడికి దవాఖానలో చికిత్స చేయించడంతో ప్రాణాలతో బయటపడినట్టు తెలిసింది.

### ఎమ్మెల్యే ఇంట్లోనే ఉరి..

రవి రెండురోజుల క్రితం సైదాపురంలోని సొంత ఇంట్లోనే ఉన్నాడు. అక్కడ ఎవరూ ఉండరు. ఒకవేళ ఆత్మహత్యకు చేసుకోవాలని భావిస్తే సైదాపురంలోని ఇంట్లోనే పాల్పడేందుకు అవకాశం ఉన్నా.. రెండు రోజుల తర్వాత ఎమ్మెల్యే అయిలయ్య ఇంటికి వచ్చి మరీ ఉరివేసుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నదని సైదాపురం గ్రామానికి చెందిన పలువురు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకునే ఘటన కంటే ముందు ఏం జరిగింది? సొంతూరు, ఇల్లు వదిలిపెట్టి ఎమ్మెల్యే ఇంట్లోకి వచ్చి ఎందుకు ఉరివేసుకోవాల్సి వచ్చిందో అర్థం కావడం లేదని ఆ గ్రామానికి చెందిన ప్రజలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుండగా శుక్రవారం 10 గంటల సమయంలో ఉరివేసుకోగా ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని దవాఖానకు తరలించడం గమనార్హం.

### బ్యాంకు రుణం కట్టలేకే ఆత్మహత్య: సీఐ

ప్రైవేట్ బ్యాంకులో తీసుకున్న రుణం కట్టే పరిస్థితి లేకనే మనస్తాపానికి గురై గంధమల్ల రవి ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ భాస్కర్ తెలిపారు. బ్యాం కు సిబ్బంది లీగల్ నోటీసులు జారీ చేశారని, ఇంటికి వచ్చి తాళంవేస్తామని, ఇంటికి నోటీసులు అతికించి బెదిరించడంతో 15 రోజులుగా మద్యం తాగుతూ ఉన్నాడని పేర్కొన్నారు.

> **రవి నా ఇంటి మనిషి**
>
> గంధమల్ల రవి నా ఇంటి మనిషి. మా ఇంట్లో ఒక సభ్యుడిగా తిరిగాడు. అతను ఇలా ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరం. గతంలో మద్యానికి బానిసైన విషయం తెలిసి మందలించిన. మద్యం తాగి ఇంట్లో ఉంటే బాగుండదని వార్నింగ్ ఇచ్చిన. బ్యాంకు రుణంతోపాటు అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. ప్రతిపక్ష నాయకులు నన్ను రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ, నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదు. రవి మరణంపై అనుమానాలు ఉంటే మా ఇంట్లోని సీసీ పుటేజీలను చెక్ చేసుకోవచ్చు.
>
> -బీర్ల అయిలయ్య

### రవి ఆత్మహత్య హైదరాబాద్‌లోనేనా?'

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో పని చేసే గంధమల్ల రవి ఆత్మహత్య హైదరాబాద్ మంత్రుల నివాసంలోని అయిలయ్య ఉంటున్న క్వార్టర్ నంబర్-28లో జరిగినట్టు అనుమానంగా ఉన్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆరోపించారు. ఈ విషయమై పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఆర్థిక ఇబ్బందులతోనే చనిపోయిండు

బ్యాంకు రుణం కట్టలేక, ఆర్థిక ఇబ్బందులతోనే నా భర్త ఆత్మహత్య చేసుకున్నడు. మా స్వగ్రామం సైదాపురంలోనూ అప్పులు చేశాడు. అందరూ కలిసి చేసిన అప్పు కట్టాలని మా ఆయనపై ఒత్తిడి చేశారు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటిపైన రేకుల షెడ్డు వద్దకు వెళ్లాడు. సుమారు 9:30 గంటలకు ఫోన్ చేస్తే ఎత్తలేదు. భయం వేసి రేకుల షెడ్డు వద్దకు వెళ్లి చూస్తే శాలువాతో ఉరి వేసుకుని కనిపించాడు. కిందికి వచ్చి ఎమ్మెల్యే, ఆయన గన్‌మెన్లకు చెప్పాను. వాళ్లు వచ్చి చనిపోయిన నా భర్తను కిందికి దించి భువనగిరి దవాఖానకు తరలించారు.

-గంధమల్ల నవిత, మృతుడి భార్య

> **సమగ్ర విచారణ చేపట్టాలి**
>
> సొంత ఇంట్లోనే ఆత్మహత్యను ఆపలేకపోయిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.. ఆలేరు నియోజకవర్గ ప్రజలను ఎలా కాపాడుతాడో చెప్పాలి? ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో పనిచేసే వ్యక్తి రవి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయి. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలి. మృతుడి కుటుంబానికి అన్నివిధాలుగా న్యాయం చేయాలి.- **గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**